www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -272 మంగళవారం 17 డిసెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

**31 లక్షల మందికి ప్రయోజనం**

**శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ ప్రకటన**



హైదరాబాద్,డిసెంబర్ 16(ప్రజావినికిడి:
ప్రభుత్వ అంచనా ప్రకారం.. కొత్తగా పది లక్షల కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉండవచ్చని.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తద్వారా 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. **మిగతాది 2లో...**

## జై శ్రీరామ్ నినాదాలు చేయడం ఎలా నేరపూరిత చర్య?

**మసీదు లోపల నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారు?**

**ఫిర్యాదుదారున్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**




న్యూఢిల్లీ, డిసెంబర్ 16(ప్రజావినికిడి:
జై శ్రీరామ్ నినాదాలు చేయడం నేరపూరిత చర్య ఎలా అవుతుందని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. మసీదు లోపల నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులపై విచారణను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌ను **మిగతాది 2లో...**

## జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

**ఉద్యోగాల ఖాళీల అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలు**

**: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



హైదరాబాద్, డిసెంబర్ 16(ప్రజావినికిడి:
తెలంగాణలో ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు జాబ్ కేలండర్ ఆధారంగా ఉంటాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగాల ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపడుతున్నామని తెలిపారు. **మిగతాది 2లో...**

## సర్పంచ్ ల బిల్లులపై

# రగడ..!





- ప్రభుత్వం తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్
- బకాయిల రాష్ట్రసమితి అంటూ సీతక్క కౌంటర్
- బీఏసీ లేకుండానే 2 బిల్లులు
- సభ కనీసం 15 రోజులు నడపాలి
- అసెంబ్లీలో ప్రభుత్వ ఆంక్షలపై హరీశ్‌రావు మండిపాటు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన
- సభా మర్యాదలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు
- ఆవేదన వ్యక్తం చేసిన శాసనసభ స్పీకర్
- సభా సంప్రదాయాలను విపక్షసభ్యులు పట్టించుకోవట్లేదు
- బీఆర్ఎస్ తీరును ఖండించిన మంత్రులు
- ఎలాంటి నిర్ణయాలు లేకుండానే ముగిసిన బీఏసీ సమావేశం
- బిఎఎసిలో శాసనసభ స్పీకర్ నిర్ణయం

2లో.



## లోక్‌సభ ముందుకు

# నేడు జమిలి బిల్లు

**సభలో ప్రవేశ పెట్టనున్న న్యాయశాఖ మంత్రి**

**అనంతరం జెపిసికి పంపేందుకు సిద్ధం**



న్యూఢిల్లీ,డిసెంబర్ 16(ప్రజావినికిడి:
దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించే జమిలి ఎన్నికలపై లోక్‌సభలో బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశ పెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. వాస్తవానికి రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల సవరణ బిల్లును సోమవారం సభల **మిగతాది 2లో...**

## మోదీ డిక్టేటర్ గా తయారయ్యేందుకు దగ్గరగా ఉన్నారు: ఖర్గే

**రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ**

**రాజకీయాల్లో మూఢ భక్తి పనికిరాదని సూచన**



డిసెంబర్ 16(ప్రజావినికిడి:
ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మరోసారి ప్రధాని మోదీని, బీజేపీ టార్గెట్ చేస్తూ విమర్శనాస్త్రాలు సంధించారు. వ్యక్తి పూజ ఎప్పటికీ మంచిది కాదని, ముఖ్యంగా ఓ రాజకీయ నేత పట్ల మూఢ భక్తి ముమ్మాటికీ చేటు అని వ్యాఖ్యానించారు. అలాంటి భక్తి రాజకీయ నేతను నియంతగా మార్చేస్తుందని ఖర్గే హెచ్చరించారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."ఓ మతం పట్ల భక్తి ఉంటే అది ఆత్మ శుద్ధి కలిగిస్తుంది. కానీ రాజకీయాల్లో భక్తి ఉంటే అది కచ్చితంగా పతనానికి దారితీస్తుంది... అంతిమంగా ఓ నియంతను తయారుచేస్తుంది. మీరందరూ ఇప్పుడు చేస్తున్నది అదే... మీరు (బీజేపీ శ్రేణులు) డప్పు కొడుతూ ఆయన (మోదీ)ను నియంతృత్వం దిశగా నెడుతున్నారు. ఒకవేళ ఆయన నియంతగా మారేందుకు సిద్ధంగా ఉంటే మాత్రం నేను కోరేది ఒక్కటే... ప్రజాస్వామ్యం ఎప్పటికీ నియంతృత్వ ఛాయల్లో మనుగడ సాగించరాదు... రాజ్యాంగంపై విశ్వాసం ఉన్నవారందరూ అందులోని సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి" అని ఖర్గే స్పష్టం చేశారు.

## కెటిఆర్ అరెస్టుకు

# రంగం సిద్ధం



- విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్
- ప్రధానకుంభకోణాలు ప్రజల ముందుకు తెస్తాం
- ఐఎఎస్‌అధికారి అర్వింద్ కుమార్‌పై విచారణకు ప్రభుత్వం అనుమతిచ్చింది
- మొదటిదశలోముగ్గురు నుంచి నలుగురితోపాటు ఏజెన్సీలపైనాకేసులు
- ఎసిబి దగ్గర అన్ని సమాధానాలున్నాయి
- అసెంబ్లీలో బిఆర్‌ఎస్‌నేతలు గుండాల మాదిరిగా వ్యవహరిస్తున్నారు
- మీడియాతో మంత్రి పొంగులేటి చిట్‌చాట్

హైదరాబాద్:డిసెంబర్ 16(ప్రజావినికిడి:
ఈకార్ రేసు అవినీతి వ్యవహారంపై విచారణకు గవర్నర్ నుంచి అనుమతి వచ్చిందని, దానిపై దర్యాప్తు చట్టప్రకారం జరుగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. న్యాయ నిపుణుల సలహాతో గవర్నర్ అనుమతి ఇచ్చారని, నేడో, రేపో సిఎస్ ద్వారా ఎసిబికి పంపిస్తామని వెల్లడించారు. కేబినెట్ భేటీ అనంతరం సోమవారం సాయంత్రం అసెంబ్లీ హాల్‌లో మంత్రి పొంగులేటి మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇక చట్టం తన పని తాను చేసుకుంటూ వెళుతుందన్నారు. ఈ కార్ రేస్‌లో ఐఏఎస్ అరవింద్‌కుమార్‌పై విచారణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, **మిగతాది 2లో...**

## మార్చి 5నుంచి ఇంటర్ పరీక్షలు

**ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్**

**తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల**



హైదరాబాద్,డిసెంబర్ 16(ప్రజావినికిడి:
తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 5 నుంచి 25 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి 29న ఎథిక్స్ అండ్ హ్యూమస్ వ్యాల్యూస్ పరీక్ష, 30న పర్యావరణ పరీక్ష జరగనుంది. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షను ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 1న, సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1న నిర్వహించనున్నారు. రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఒకేసారి ఈ పరీక్షను నిర్వహిస్తారు.

**మిగతాది 2లో...**

## రేపు కాంగ్రెస్ ఛలో రాజ్ భవన్...

**పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి**

**అదానీ, మణిపూర్ అంశాలను నిరసిస్తూ ఛలో రాజ్ భవన్**

**నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లనున్న నేతలు**



డిసెంబర్ 16(ప్రజావినికిడి:
రేపు ఛలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించాలని తెలంగాణ పీసీసీ నిర్ణయించింది. టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు పాల్గొననున్నారు.గౌతమ్ అదానీ, మణిపూర్ అంశాలపై ప్రధాని నరేంద్రమోదీ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ ఈ ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు అమెరికాలో కేసు నమోదైన విషయం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అలాగే మణిపూర్‌లో అల్లర్లు జరిగినప్పటికీ ప్రధాని మోదీ ఇప్పటి వరకు అక్కడకు వెళ్లలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.వీటిని నిరసిస్తూ ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఏఐసీసీ పిలుపునిచ్చింది. దీంతో 18వ తేదీ ఉదయం 11 గంటలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా రాజ్ భవన్‌కు వెళ్లనున్నారు.

# సర్పంచ్ ల బిల్లులపై రగడ.!

హైదరాబాద్,డిసెంబర్ 16(ప్రజావినికిడి: హరీశ్ రావు ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. బీఏసీ లేకుండానే 2 బిల్లులు ప్రవేశపెట్టి, చర్చ పెట్టడం సంప్రదాయ విరుద్ధమని, కనీసం బీఏసీ మీటింగ్‌లో ఎన్ని రోజులు సభ నడుపుతారో కూడా స్పష్టంగా చెప్పడం లేదన్నారు. సభ కనీసం 15 రోజులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం 3, 4 రోజులు సభ నడుపుతామని చెబుతోందని ఇలా అయితే ప్రజా సమస్యలపై చర్చ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రభుత్వ ఆంక్షలపై కూడా హరీశ్ రావు మండి పడ్డారు. తొలిరోజు టీ షర్టులతో వస్తే ఎందుకు ఆపారని మీటింగ్?లో నిలదీశామని హరీశ్‌రావు తెలిపారు. టీషర్టుతో పార్లమెంటుకు రాహుల్ వెళ్లట్లేదా అని ప్రశ్నించారు. లగచర్ల రైతులకు బేడీలపై చర్చించాలంటే స్పందించట్లేదన్నారు. సభలో పర్యాటకం కంటే లగచర్ల రైతులపై చర్చే ముఖ్యమని చెప్పామన్నారు. ప్రతి రోజూ జీరో అవర్ ఉండాలని కోరినట్లు హరీశ్‌రావు తెలిపారు. అయితే ఈ ఆరోపణలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖండించారు. అసెంబ్లీ నిబంధనల మేరకే బీఏసీ జరిగిందని స్పష్టం చేశారు. బీఏసీలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరిగ్గాలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అసెంబ్లీ ఎన్ని రోజులు నడుపాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని, ఈ విషయం పదేళ్లు పాలించిన వారికి ఇది తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పినట్లు సభ పనిదినాలు ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. తాను ఎల్‌వోపీగా ఉన్నప్పుడు గత ప్రభుత్వం ఇలాగే చేసిందన్న విషయం తనకు తెలియదా అన్నారు. ఇప్పుడు కూడా సభ ఎన్ని రోజులు జరపాలో స్పీకరే నిర్ణయిస్తారని తేల్చి చెప్పారు. శాసనసభలో విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభ రేపటికి వాయిదా పడింది. సభా మర్యాదలు దెబ్బతీసేలా సభ్యులు వ్యవహరిస్తున్నారని స్పీకర్? ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశమైంది. అయితే బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశారు. సభా పని దినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకు వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ప్రకటించింది. మరోవైపు టీ షర్ట్స్‌పై బీఏసీలో వాడి వేడి చర్చ జరిగింది. టీ షర్ట్స్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీ షర్ట్స్ వేసుకుని వెళ్లడం లేదా అని సమావేశంలో హరీష్ రావు ప్రశ్నించారు. బీఏసీ సమావేశంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. గంట సేపు సమావేశం జరిగినా సభ పనిదినాలపై స్పష్టత ఇవ్వడం లేదని ఆయన అన్నారు. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేసినట్ల మాజీ మంత్రి తెలిపారు. 'మేము 15రోజులు సభ పెట్టాలని అడిగాము. సభను నాలుగైదు రోజులే నడిపే మూడ్‌లో ఉన్నారు. మమ్మల్ని అడ్వయిజ్ మాత్రమే ఇవ్వాలని సీఎం అన్నారు. కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అంటున్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసింది. ప్రోటోకాల్ పాటించడం లేదని స్పీకర్‌కు చెప్పాం. బీఏసీ పెట్టకుండానే బిల్స్ ఎలా పెడతారు అని అడిగాము. పెళ్ళిళ్లు ఉన్నాయని సభ పెట్టకపోవడం ఏంటని అడిగాము. కనీసం 15 రోజులు ఈసారి సభ నడపాలని బీఆర్ఎస్ నుంచి అడిగాం. ప్రతిరోజూ జీరో అవర్ పెట్టాలని అడిగాం. టీషర్ట్‌లతో ఎందుకు రానియడం లేదని గట్టిగా అడిగాము. మీ నాయకుడు రాహుల్ గాంధీ టీ షర్ట్‌లతో వెళ్ళాడు కదా అని గుర్తు చేశాము. బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారు' అంటూ హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ భేటీ జరిగింది. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం హరీష్ రావు, ఎంఐఎం సభ్యులు హాజరయ్యారు. కాగా.. సభలో మీరు కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అనడంతో బీఆర్ఎస్ వాకౌట్ చేసిందన్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసిందని హరీష్ రావు తెలిపారు. సభ పని దినాలు అజెండా పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని నిరసన తెలిపామన్నారు. సభ గంటన్నర పాటు కొనసాగిందన్నారు. సభలో మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్? సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో సభ్యుల వద్ద ప్లకార్డులను తీసుకురావాలని మార్షల్స్?కు స్పీకర్? ఆదేశించారు. ప్లకార్డులను మార్షల్స్?కు ఇస్తే మాట్లాడే అవకాశమిస్తామని స్పీకర్? సభ్యులకు సూచించారు. విపక్ష సభ్యుల నినాదాల మధ్య సభను రేపటికి వాయిదా వేశారు. శాసనసభలో బీఆర్ఎస్? నేతల తీరును ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్? బాబులు ఖండించారు. పర్యాటక అంశంపై మంత్రి మాట్లాడుతుంటే అడ్డుకున్నారని మండిపడ్డారు. సభా సంప్రదాయాలను విపక్షసభ్యులు పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. సభా మర్యాదకు భంగం కలిగించడం సరికాదని భట్టి విక్రమార్క హితవుపలికారు. సభాపతిపై విపక్ష సభ్యులకు గౌరవం ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు శాసనసభలో బీఆర్ఎస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించడాన్ని మంత్రి శ్రీధర్?బాబు తప్పుపట్టారు. సభా సంప్రదాయాలను విపక్షాలు గౌరవించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్? ఆదేశాలను సభ్యులు పక్కనపెట్టడం సరికాదన్నారు. విపక్షాలు లేవనెత్తిన ప్రతి అంశంలో ప్రభుత్వం జవాబిస్తుందన్నారు. బీఏసీ భేటీలో విపక్షాలు అభిప్రాయాలు తీసుకున్నారని తెలిపారు. విపక్షసభ్యులు సభా సమయం వృథా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మరో ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ మేరకు బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 21 వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి.

# కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

కొత్త రేషన్ కార్డుల మంజూరికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను కుడా ఆధారం చేసుకుంటామన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీతో.. ప్రభుత్వంపై అదనంగా రూ.956 కోట్ల భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చెయ్యబోతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అదనపు పేర్ల నమోదుకు.. మీ సేవ కేంద్రం ద్వారా గడిచిన పదేళ్లుగా వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం నియమించారని చెప్పారు. తనను ఛైర్మన్‌గా, సహచర మంత్రులు దామోదరం రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సభ్యులుగా ఉన్నారని వెల్లడించారు. ఈ ఉప సంఘం పలుమార్లు సమావేశమై.. సిఫారసులను కేబినెట్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారుతెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తమ్ చెప్పారు. అంతే గాకుండా రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల నుండి సేకరించిన సూచనలను కుడా మంత్రివర్గ ఉప సంఘం పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వీటన్నింటినీ అధ్యయనం చేసిన ఉపసంఘం.. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తూ చేసిన సిఫారసులు.. కేబినెట్ ముందుంచినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను చేబడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలతో పాటు తాండాలలో కుడా చౌక ధరల దుకాణాల ఏర్పాటు చేస్తామన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలెవ్వరు వినియోగించక పోవడంతో.. దారి మళ్లుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకే తెల్ల రేషన్ కార్డు దారులందరికి ఇకపై సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో.. 91 లక్షల 68 వేల 231 రేషన్ కార్డులు ఉందేవన్నారు. మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.38 కోట్లని ఆయన సభకు వివరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇక్కడి నుండి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారని.. 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులు రద్దు అయినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణా ఏర్పడ్డాక 2.7 కోట్ల లబ్ధిదారులకు గాను మొత్తం 89 లక్షల 21 వేల 907 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.

# లోక్‌సభ ముందుకు నేడు జమిలి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశ పెట్టనున్నట్లు ముందుగా వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రివైజ్ చేసిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో వీటిని తొలగించారు. లోక్‌సభ కార్యదర్శి విడుదల చేసిన రివైజ్డ్ జాబితాలో సోమవారం ఈ రెండు బిల్లులకు సంబంధించిన అజెండాను పెట్టలేదు. దీంతో ఈ బిల్లులు నేడు సభ ముందుకు రాలేదు. మంగళవారం ఈ బిల్లులు లోక్‌షభ ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. ఈ క్రమంలో మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకు ఈ బిల్లు రానుంది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్రం మంగళవారం లోక్‌సభ లో ప్రవేశపెట్టనుంది. జమిలి ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (ఏఖఅ)కి పంపించాలని స్పీకర్ ఓం బిర్లాను కేంద్రమంత్రి అభ్యర్థించనున్నారు. అనంతరం దీనిపై ప్యానెల్ కమిటీ ఏర్పాటుకు సభ్యులను ప్రతిపాదించాలని సభాపతి పార్టీలను కోరనున్నారు. సాయంత్రానికి కమిటీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉంది. పార్లమెంట్‌లో పార్టీల సంఖ్యాబలం ఆధారంగా కమిటీలో వారికి చోటు దక్కుతుంది. అంటే అతిపెద్ద పార్టీ అయిన భాజపా నుంచి ఒక ఎంపీ కమిటీ ఛైర్మన్‌గా ఉంటారు. తొలుత ఈ ప్రతిపాదిత కమిటీకి 90 రోజుల సమయం కేటాయిస్తారు. అవసరాన్ని బట్టి ఆ తర్వాత దాన్ని పొడిగిస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జమిలి ప్రణాళికకు ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులను కేంద్ర కేబినెట్ ఈనెల 12న ఆమోదించింది. వీటిని ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే లోక్‌సభ ముందుకుతీసుకురావాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉంది. ప్రస్తుత శీతాకాల సమావేశాలు ఈనెల 20తో ముగియనున్నాయి.

# మార్చి 5నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 3, 2025 నుంచి ఫిబ్రవరి 22, 2025 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదలైంది. మార్చి 1నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా ప్రకటించారు. ఇంటర్మీడియట్ రెగ్యులర్,ఒకేషనల్ విద్యార్థులకు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయి.



**తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఇదే..**

**ఫస్ట్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే**

05-03-2025 - పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్

07-03-2025 - పార్ట్-1 ఇంగ్లీష్ పేపర్

11-03-2025 - మాథ్స్ పేపర్ 1%ూ%, బోటని పపెర్-1 , పొలిటికల్ సైన్స్ పేపర్-1

13-03-2025 - మ్యాథ్స్ పేపర్ 1%దీ% , జూలాజి పేపర్ -1, హిస్టరీ పేపర్-1

17-03-2025 - ఫిజిక్స్ , ఎకనామిక్స్

19-03-2025 - కెమిస్ట్రీ , కామర్స్

సెకెండ్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే

06-03-2025 - పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్

10- 03-2025 - పార్ట్-1 ఇంగ్లీష్

12-03-2025 - మాథ్స్ పేపర్ 2%ూ%, బోటని , పొలిటికల్ సైన్స్

15-03-2025 - మ్యాథ్స్ పేపర్ 2%దీ% , జూలాజి, హిస్టరీ

18-03-2025 - ఫిజిక్స్ , ఎకనామిక్స్

20-03-2025 - కెమిస్ట్రీ , కామర్స్

# కౌశిక్ రెడ్డి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు...

### తప్పుబట్టిన హైకోర్టు

### బంజారాహిల్స్ సీఐ విధులకు ఆటంకం కలిగించారంటూ కౌశిక్ రెడ్డిపై కేసు

### విచారణలో భాగంగా ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హైదరాబాద్,డిసెంబర్ 16(ప్రజావినికిడి:నోటీసులు ఇవ్వకుండా తన మొబైల్ తీసుకున్నారని కౌశిక్ రెడ్డి పిటిషన్

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మొబైల్‌ను తిరిగి ఇచ్చేయాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. బంజారాహిల్స్ సీఐ విధులకు ఆటంకం కలిగించారంటూ పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పోలీసులు... ఎమ్మెల్యే మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా అతని మొబైల్‌ను తీసుకున్నారు. అయితే పోలీసులు తన మొబైల్‌ను లాక్కున్నారని, కనీసం తనకు నోటీసులు కూడా ఇవ్వలేదని కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. ఈ మొబైల్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించాల్సి ఉందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన కుట్రలు పన్నుతున్నారన్నారు. అయితే ఫోన్ సీజ్ చేయాల్సి వస్తే నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. మొబైల్ ను ఆయనకు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది.

# జై శ్రీరామ్ నినాదాలు చేయడం ఎలా నేరపూరిత చర్య?

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షిస్తూ న్యాయమూర్తులు పంకజ్ మిథాల్, సందీప్ మెహతా ఈ అంశాన్ని లేవనెత్తారు. మసీదు లోపల 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన ఇద్దరు వ్యక్తులపై విచారణను రద్దు చేసిన కర్ణాటక హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన భారత అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. హైదర్ అలీ సిఎం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఒక నిర్దిష్ట మతపరమైన పదబంధాన్ని లేదా పేరును అరుస్తుంటే అది ఎలా నేరం అని బెంచ్ ప్రశ్నించింది. మసీదు లోపలికి వచ్చి నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారని సుప్రీంకోర్టు ఫిర్యాదుదారుని ప్రశ్నించింది. విచారణ సందర్భంగా, పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ప్రతివాదులను ఎలా గుర్తిస్తారు? అవన్నీ సీసీటీవీలో రికార్డయ్యాయని అంటున్నారు. లోపలికి వచ్చిన వ్యక్తులను ఎవరు గుర్తించారని బెంచ్ ప్రశ్నించింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 లేదా సెక్షన్ 447లోని నిబంధనలను అభియోగాలు తాకడం లేదని హైకోర్టు గుర్తించిందని ధర్మాసనం పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 క్రిమినల్ బెదిరింపులకు సంబంధించిందని, అయితే సెక్షన్ 447 నేరపూరిత అతిక్రమణకు శిక్షను సూచిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదును ప్రస్తావిస్తూ, ఎఫ్ఐఆర్ నేరాల ఎన్‌సైక్లోపీడియా కాదని కామత్ అన్నారు. మసీదులోకి ప్రవేశించిన అసలు వ్యక్తులను మీరు గుర్తించగలిగారా? దీనిపై రాష్ట్ర పోలీసులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని కామత్ అన్నారు. దీనిపై ధర్మాసనం పిటిషన్ కాపీని రాష్ట్రానికి ఇవ్వాలని పిటిషనర్‌ను కోరగా, కేసు తదుపరి విచారణను 2025 జనవరికి వాయిదా వేసింది. అంతకుముందు సెప్టెంబర్ 13న, ఈ కేసులో ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. ఎవరైనా 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తే ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను ఎలా దెబ్బతీస్తారన్నది అర్థం కావడం లేదని కర్ణాటక హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రజా విఘాతం లేదా ఎలాంటి చీలిక ఏర్పడినట్లు ఎలాంటి ఆరోపణలు లేవని వ్యాఖ్యానించింది. ఐపిసి సెక్షన్ 506 ప్రకారం నేరపూరిత బెదిరింపు నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎవరో కూడా ఫిర్యాదుదారు చూపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మసీదులోకి ప్రవేశించి మతపరమైన నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ప్రొసీడింగ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన 2023 సెప్టెంబర్ 24న జరిగింది. పుత్తూరు సర్కిల్‌లోని కడప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదులోకి ప్రవేశించి 'జై శ్రీరామ్' నినాదాలు చేయడంతో బెదిరింపులకు దిగారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఎలాంటి ఆరోపణ చేసిన నేరాలకు సంబంధించిన ఆధారాలు లేకుండా, పిటిషనర్‌లపై విచారణ కొనసాగించడం చట్టపరమైన దుర్వినియోగం అవుతుందని, న్యాయపరమైన అనుచితానికి దారి తీస్తుందని హైకోర్టు నిర్ధారించింది.

# జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని దశలవారీగా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు. కాగా, 'అదిగో జాబ్ క్యాలెండర్.. ఇదిగో జాబ్ క్యాలెండర్' అంటూ నిరుద్యోగులను ఊరించిన రేవంత్‌రెడ్డి సర్కారు, ఈ ఏడాది ఆగస్టు 3న గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఖాళీల వివరాల్లేని.. నోటిఫికేషన్, పరీక్షల తేదీల్లేని జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉసూరుమనిపించింది. జాబ్ క్యాలెండర్‌లో మొత్తం 20 రకాల షెడ్యూళ్లను ప్రకటించగా వీటిలో అర్హత పరీక్ష అయిన టెట్ రెండు సార్లు ఉన్నది. మిగతా 18లో గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు గతంలో జారీ అయినవే కావడం గమనార్హం. పరీక్షలు మాత్రమే నిర్వహించాల్సి ఉన్న వీటిని కూడా కొత్త జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించి కాంగ్రెస్ సర్కారు తన ఖాతాలో వేసుకున్నది. యూపీఎస్సీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుంది. నోటిఫికేషన్ తేదీ, దరఖాస్తు గడువు, రాత పరీక్ష తేదీ లాంటి పూర్తి వివరాలు అందులో పొందుపరుస్తుంది. కానీ రేవంత్ సర్కారు ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ఇవేవీ లేవు. కేవలం ఫలానా నెలలో నోటిఫికేషన్ ఇస్తాం.. ఫలానా నెలలో పరీక్ష నిర్వహిస్తామన్న వివరాలు మాత్రమే ప్రకటించారు.

# కెటిఆర్ అరెస్టుకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి కెటిఆర్ అరెస్టుపై తానేమీ వ్యాఖ్యానించబోనని ఆయన తెలిపారు. ఈ కారు రేస్‌లో మొదటి వి డతలో ముగ్గురి నుంచి నలుగురు ఉన్నారని, ఏజెన్సీల మీద కూడా కేసులు అవుతాయని, ఈ కారు రేస్‌లో పెద్ద మొత్తంలో చేతులు మారాయని మంత్రి ఆరోపించారు.

కొంతమంది అహంకార పూరితమైన మాటలు మాట్లాడుతున్నారని, ఈ కారు రేస్‌లో జరిగిన దోపిడీ, వారి స్వలాభం కోసం చేసిన పనులపై తాము కేబినెట్‌లో చర్చించామన్నారు. ఈ కారు రేస్ అవినీతిపై ఏసిబి దగ్గర సమాధానం ఉందని ఆయన అన్నారు. తీగ లాగితే డొంక కదులుతుందని ఆయన పేర్కొన్నారు. తాము అన్నది తుస్సు బాంబులు అయితే బిఆర్ఎస్ నాయకులు ఢిల్లీకి వెళ్లి ఎందుకు వెళుతున్నారని, వారు ఎందుకు భయ పడుతున్నారని ఆయన ప్రశ్నించారు. సభలో బిఆర్ఎస్ నాయకులు గుండాల మాదిరిగా ప్రవర్తిస్తున్నారన్నారు. వారికి డిబెట్ చేసే ధైర్యం లేకనే ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి వస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలు తరువాత పాదయాత్ర చేస్తారా మోకాళ్ల యాత్ర చేస్తారా వాళ్ల ఇష్టమని మంత్రి ఎద్దేవా చేశారు. విద్యుత్ కమిషన్‌పై సమయం వచ్చినప్పుడు అన్నీ బయటపడతాయని ఆయన తెలిపారు. కేబినెట్ భేటీలో కొన్ని బిల్లులపై చర్చించామని మంత్రి తెలిపారు. ఈ సమావేశాల్లో ఆర్ఓఆర్ బిల్లును ప్రవేశపెడతామని ఆయన పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 17 డిసెంబర్ 2024

## భవాని నగర్ సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న..

### టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి..



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి 125 డివిజన్ గాజులరామారంలో గల భవాని నగర్ లో శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ శాంతికి, సంతోషానికి చిహ్నం క్రిస్టమస్ పండగని, ప్రపంచ వ్యాప్తంగా ఏకకాలంలో జరిగే పండుగ అని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భవాని నగర్ కాలనీ అధ్యక్షులు గోపాలకృష్ణ,కాంగ్రెస్ నాయకులు దండే రాజు,మార్లింగా, పవన్,అన్వర్,శ్రీనివాస్ గౌడ్,సంజు కాలనీవాసులు, నాయకులు,క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డికి ఆహ్వానం..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జిహెచ్ఎంసి పరిధిలో ఉన్నటువంటి అన్ని డివిజన్లలో జరగబోయే ఈనెల క్రిస్మస్ సెలబ్రేషన్స్ నిమిత్తమై డివిజన్ వారీగా ఎంపిక చేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి అందజేసి సెలబ్రేషన్స్ కి ఆహ్వానించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ ఇంచార్జి కో–ఆర్డినేటర్ కల్లోజి రవికుమార్, నియోజకవర్గ పాస్టర్స్ చైర్మన్ గోడి శేఖర్,ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్,అల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డా.అవిజె జేమ్స్ ,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి,వినోద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎంపీటీసీ కాసాని కృష్ణ ముదిరాజ్

## 18 వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన కొలన్ రాజశేఖర్ రెడ్డి



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఎంపీటీసీ కాసాని కృష్ణ ముదిరాజ్ 18 వ వర్ధంతి సందర్భంగా కృష్ణ తనయులు కాసాని సుధాకర్ ముదిరాజ్ అలాగే కాసాని వీరేశ్ ముదిరాజ్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కృష్ణ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి,ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారాయణ , దూసకంటి వెంకటేష్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# దీపక్ నైట్రేట్ యూనిట్ 2 యాజమాన్యం కార్మికుల వేతన ఒప్పందం వెంటనే చేయాలి..

### - సిఐటియూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ...

ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో దీపక్ నైట్రేట్ యూనిట్ 2 యాజమాన్యం గత 22 నెలల నుండి కార్మికుల వేతన ఒప్పందం చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ నుండి దీపక్ నైట్ యూనిట్ 2 వరకు నిరసన ర్యాలీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకానీ లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ, దీపక్ నైట్రేట్ యూనిట్ టు యాజమాన్యానికి గత 22 నెలల క్రితం కార్మికుల వేతనాల పెరుగుదల గురించి డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగింది అప్పటినుండి ఇప్పటివరకు యాజమాన్యం కార్మిక నాయకుల్ని చర్చలకు పిలిచి కాలయాపన చేస్తుంది తప్ప కార్మికులకు సంబంధించిన వేతన ఒప్పందం అమలు చేయడం లేదని మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్టు ఇంకోపక్క కార్మికులకు ఇచ్చే ఇన్సెంటివ్ కూడా ఆపివేసిందని దీనివల్ల కార్మికులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని ఇక్కడున్న కంపెనీ జనరల్ మేనేజర్ నియంతలాగా




వ్యవహరిస్తూ కార్మికుల సహనాన్ని పరీక్షిస్తున్నాడని కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి కెమికల్ కంపెనీలలో విధులు నిర్వహిస్తూ కంపెనీకి వందల కోట్ల రూపాయల లాభాలు తెచ్చి పెడుతుంటే కంపెనీ యాజమాన్యం మాత్రం కంపెనీ ఉత్పత్తుల పెరుగుదల మీద ఉన్న ఆలోచన కార్మికుల వేతన ఒప్పందాల మీద లేదని వేతనాల పెరుగుదల చేయకుండా కార్మికుల కుటుంబాలతో ఆటలాడుతుందని ఇప్పటికైనా యాజమాన్యం ఆలోచన చేసి వెంటనే వేతన ఒప్పందం చేయాలని లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గాన్ని సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని దానికి పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు,పసుల అంజయ్య,ఈ దేవదానం,రావుల స్వాతి,ప్రసాద్,కే శీను,ఖలీల్, షఫీ వినయ్,గోపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సహభావన క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు..







ప్రజావినికిడి,(నాగోల్):
నాగోల్ డివిజన్ ఆనంద్ నగర్ పరిధి లోని సహభావన క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తపల్లి జోసెఫ్ ఆధ్వర్యంలో సహభావన అపార్ట్మెంట్స్ బి అండ్ సి మధ్యలో క్రిస్మస్ వేడుకలు శనివారం నాడు ఎంతో అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా స్పెషల్ సాంగ్స్, గీతాలాపన, యవనస్తుల స్క్రిప్ట్, చిన్నారుల నృత్యాలు, బహుమతుల ప్రధానం, కేక్ కటింగ్ క్యాండిల్ లైటింగ్ ఎంతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య ప్రసంగికులుగా బిషప్ కే.తిమోతి పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు జన్మదినాన్ని ప్రపంచమ%శీ%తా క్రిస్మస్ గా జరుపుకుంటారని తెలిపారు. క్రిస్మస్పండుగ ప్రేమ, కరుణ,శాంతి, త్యాగాలకు చిహ్నమని చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ కొత్తపల్లి జోసెఫ్ మాట్లాడుతూ, ఇక్కడ కులమతాలకు అతీతంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటామని అన్నారు. క్రైస్తవం అంటే మతం కాదని అదొక సత్య మార్గమని తెలిపారు. తమకు అన్ని విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఆ యేసు దయవల్ల ప్రతి సంవత్సరం మరింత ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటామని అన్నారు. ఆ కరుణామయుడు ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, దైవజనులు,దైవ సేవకులు విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# షాద్ నగర్ చెస్ అకాడమీకి ప్రైజ్లే, ప్రైజులు

**తెలంగాణ చెస్ అసోసియేషన్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా చెస్ పోటీలు..**

**చెస్ పోటీలలో పాల్గొన్న షాద్ నగర్ చెస్ అకాడమీ క్రీడాకారులు..**

**గెలుపొందిన విద్యార్థులను అభినందించిన చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్..**

ప్రజావినికిడి,(షాద్ నగర్):
హైదరాబాద్ లో ఎల్ బీ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ 50 సంవత్సరాల




గోల్డెన్ జూబ్లీ సందర్భంగా నిర్వహించిన ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ లో షాద్ నగర్ పట్టణానికి చెందిన షాద్ నగర్ చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్ అధ్యర్యంలో పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 07,09,11,13 విభాగాలో ఈశాని, సుమీత్ కుమార్, దియాంషి రెడ్డి,చార్విక్ శౌర్యా, కార్తికేయ, శ్రీహర్షిత్,సాత్విక్,



నిఖిల్ వీర వెంకటేష్, ఆదిదేవ రెడ్డి, భవీన్ రాథోడ్,ప్రణీత్ తేజ, ఉష శ్విని,దివ్య శ్రీ, సాయి సుశాంత్, సాత్విక్ గౌడ్,రిత్విక్ గౌతమ్,శ్రీలిఖిత్,ధనిష్ సాయి తేజ్,శ్రీ రోహన్,వేదన,వేధిత, సుగంధన్ చందరగా క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి మెరిట్ సర్టిఫికెట్ లు,గోల్డ్ మెడల్స్,ట్రోఫీస్ సాధించారు.

# హైదరాబాద్‌లో ఆగని డ్రగ్స్ దందా

## మీర్‌పేట్‌లో భారీగా పట్టుబడ్డ డ్రగ్స్

హైదరాబాద్డిసెంబర్ 16ప్రజావినికిడి:
తెలంగాణ నార్కోటిక్ అధికారులు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నా.. హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా మాత్రం ఆగడంలేదు. తాజాగా మీర్‌పేట్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడడం కలకలం రేపుతోంది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు టాస్క్‌ఫోర్స్ పోలీసులు. వారి నుంచి 53 కేజీల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు పోలీసులు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో భారీగా రక్షణ స్వాధీనం చేసుకున్నారు ఎల్బీనగర్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు. మీర్‌పేట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు నిందుతుల నుంచి కోటి 25 లక్షల రూపాయల విలువచేసే 53.5 కిలోల పప్పీస్ట్రా డ్రగ్ సీజ్ చేశారు రాచకొండ పోలీసులు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈజీ మనీ కోసం అలవాటు పడిన నిందితులు నార్కోటిక్ డ్రగ్స్ ను విక్రయించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా రాజస్థాన్‌కు చెందిన మంగీలాల్, బిష్ణోయ్ మంకీలాల్ దాకా రామ్ ముగ్గురు నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన పింటూ అనే వ్యక్తి నుంచి పప్పీస్ట్రా మాదకద్రవ్యాలని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాదులో విక్రయిస్తున్నారు.

పక్కా సమాచారం తెలుసుకున్న రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారుఅయితే ఈ మాదకద్రవ్యాలను లారీలు, బస్సులు, ట్రైన్ ద్వారా నగరానికి తీసుకువచ్చి కన్స్యూమర్లకు అమ్ముతున్నారని రాచకొండ సీపీ తెలిపారు 2023లో మంకీలాల్ బిష్ణోయ్‌ను హయత్ నగర్ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఇతనిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని సీపీ తెలిపారు. కాగా మెయిన్ పెడ్లర్ గా ఉన్న పింటూను పట్టుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా మరో ముగ్గురు నగరంలో స్థానిక రిసీవర్సుగా ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని రాచకొండ సీపీ తెలిపారు.



అయితే ఈ పప్పీస్ట్రాను పాలు వాటర్, ఛాయ్‌లో కలుపుకుని తాగుతారు. మరోవైపు, ఈ కేసు ఇంకా విచారణలో ఉందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని రాచకొండ సిపి సుధీర్ బాబు వెల్లడించారు.

# ఎస్సీ వర్గీకరణలో మాదాసి మదారి కురువలను "ఏ" జాబితాలో చేర్చండి..

## మాదాసి,మాదారి కురువ సంఘం షాద్ నగర్ తాలూకా అధ్యక్షుడు సిందం విఠలయ్య..
## ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీం అక్తర్ కు వినతి పత్రం సమర్పణ..

ప్రజావినికిడి,(షాద్ నగర్):
ఎస్సీ వర్గీకరణలో మాదాసి మదారి కురువలను "ఏ" లో చేర్చాలి అంటూ మాదాసి మాదారి కురువ సంఘం షాద్ నగర్ తాలూకా అధ్యక్షుడు సిందం విఠలయ్య కోరారు. ఎస్సి వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ ను రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాదాసి, మాదారి కురువ సంఘం షాద్ నగర్ తాలూకా అధ్యక్షుడు సిందం విఠలయ్య ఆధ్వర్యంలో మాదాసి మాదారి కురువ నాయకులు సోమవారం ప్రభుత్వ రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేకంగా కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా



ఈకసభ్య కమిషన్ చైర్మన్ కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్వయంగా అందజేసినట్టు తెలిపారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ మాదాసి మాదారి కురువల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై తమ సంఘం ద్వారా అభిప్రాయాలను పంచుకున్నారు. వర్గాల సామాజిక-ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య, ఉద్యోగాలకు రిజర్వేషన్లు పొందడంలో ఎదుర్కొంటున్న అన్యాయాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమన్నారు. న్యాయపరమైన అంశాలు, సామాజిక పరిస్థితులను పరిశీలించేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. తప్పకుండా ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసి మాదారి కురువ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు నత్తి శివరాములు, బండల లక్ష్మయ్య, కోశాధికారి కొయ్యల నరసింహులు, బండల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇరుముడి కట్టు శబరిమలక్కు అంటూ అయ్యప్ప స్వాములు శబరిమల యాత్ర..






ప్రజావినికిడి, (శంషాబాద్):
శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారంరోజు అయ్యప్ప ఇరుముడి కార్యక్రమం బుక్క కిట్టు గురు స్వామి ఆధ్వర్యంలో హరిహర పుత్ర అయ్యప్ప స్వామి నామస్మరణతో అమ్మపల్లి దేవాలయ ప్రాంగణంలో మారుమోగింది. ఇరుముడి కార్యక్రమం అనంతరం స్వాములకు విచ్చేసిన భక్తులకు స్థానికులు హీరేఖర్ శివాజీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సన్నిధానం గురు స్వామి నడిగడ్డనవీన్, మామిళ్ళ జగన్, మల్చలం శంకర్, మహేష్,కొమ్ము కిరణ్, సన్నిధానం స్వాములు అదేవిధంగా చౌదరిగుడా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వాములు శబరి యాత్రకు స్వామియే శరణమయ్యప్ప నామ స్మరణతో శబరిమలకు బయలుదేరారు.

# భూదేవి హిల్స్ భూముల సర్వే చెయ్యించండి...

## సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్...

ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):



గాజులరామారం రెవిన్యూ పరిది భూదేవిహిల్స్ లో ప్రభుత్వ,ప్రైవేట్ భూములు ఓవర్లాపింగ్ సమస్య ఉందని దానిని అసారా చేసుకొని భూకబ్జాదారులు ప్రభుత్వ భూమిని కూడా తన భూమే అని చెప్పి ప్లాట్లుగా చేసి సుమరు 15 నుండి 20లక్షలకు అమ్ముతు ప్రజలను మోసం చేస్తున్నారని కావున వెంటనే సర్వే నిర్వహించి ఎంత ప్రభుత్వ భూమి,ప్రైవేట్ భూమి ఉందొ తేల్చాలని నేడు కలెక్టరేట్లో ప్రజావాణి సందర్భంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వరు మాట్లాడుతూ, 2018లొ కోర్టు సర్వే చెయ్యాలని ఆదేశాలు ఇచ్చినప్పటికి నేటికీ కూడా సర్వే చెయ్యకపోవడం అధికారుల పనితీరు ఎలా ఉందొ తెలియచేస్తుందని,అధికారుల నిర్లక్ష్యానికి కారణం అలసత్వమా లేక భూకబ్జాదారులతో ఏమైనా లాలూచి పడ్డారా అని ఆలోచించాల్సి వస్తుందని వెంటనే సర్వే చెయ్యకపోతే అదే కోర్టుకు అధికారులను పిలిపించాల్సి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి వెంటనే డీఐని పిలిపించి సర్వే కోసం ఏర్పాట్లు చేసుకొని హద్దులు తేల్చాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్ పాల్గొనడం జరిగింది.

# భవాని నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవాని నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ముందుగా నూతనంగా నియామకం అయిన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే మూసినది ప్రక్షాళనలో భాగంగా



మూసి అభివృద్ధికి మేము ఎప్పుడు అండగా ఉంటామని, అలాగే మూసి అభివృద్ధి పేరుతో పేద అలాగే మధ్య తరగతి ఇండ్లు కులగొడతాము అంటే ఊరుకునేది లేదని అన్నారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రంగ నర్సింహోగుప్తా, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు జీ. లక్ష్మినారాయణ, సెక్రటరీ సంతోష్ కుమార్, అదనపు జనరల్ సెక్రటరీ గిరిధర్, కోశాధికారి అశోక్, ఉపదక్షులు తుల్జా ప్రకాష్, జీ. తులసి కృష్ణ గౌడ్, తిరుపతి స్వామి, శ్రీనివాస చారి, మల్లారెడ్డి, ఆదినారాయణ, నర్సింప ిరెడ్డి, శేషకుమారి, వంశీకృష్ణ, సురేష్, మురళీధర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్2 ప్రశాంతం

**45.57శాతం మంది హాజరు**
**టిడిపి, చంద్రబాబుపై ప్రశ్నలు**
**కెసిఆర్, సోనియా, వైఎస్ఆర్లపైనా క్వశ్చన్స్ పురిటినొప్పులతో పరీక్ష రాసిన గర్భిణి, ఆమె కోసం సిద్ధంగా 108 వాహనం ఏర్పాటు**

హైదరాబాద్/డిసెంబర్ 16ప్రజావినికిడి:
: రాష్ట్రంలో గ్రూప్ -2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. రెండో రోజు ఉద యం జరిగిన పేపర్3 పరీక్షకు 2,51,738 మంది (45.62 శాతం), మధ్యాహ్నం జరిగిన పేపర్4కు 2,55,468 మంది (45.57 శా తం) హాజరయ్యారు. పరీక్షకు హాజరయ్య అ భ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా రు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసులు అ భ్యర్థులను తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్నా రు. పరీక్షా కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే 144వ సెక్షన్ అమలు చేశారు. ఆదివారం పేపర్ 1 పేపర్ 2 పరీక్షలు జరిగాయి. సోమవారం ఉ దయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్ 3 పరీక్ష జరుగగా, మధ్యాహ్నం 3 గం టల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 4 పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పేపర్ 3 (ఎకానమీ అండ్ డవలప్‌మెంట్) ప్రశ్నలు క్లిష్టంగా ఉన్నాయని అభ్యర్థులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పేపర్ 4( తెలంగాణ ఉద్యమ చరిత్ర)లో ప్రతి అంశం క వర్ అయ్యేలా ప్రశ్నల సరళి ఉందని పేర్కొన్నారు. తొలిదశ, మలిదశ ఉద్యమాలు, వివిధ కమిటీలు, వివిధ ఉద్యమకారుల గురించి, వి విధ సంస్థల గురించి, వివిధ పార్టీల గురించి, ఉద్యమ గేయాలపై, విప్లవ సంస్థల ప్రస్థానం, కార్మిక సంస్థల ప్రస్థానం, రైతు ఉద్యమాలు, నిజాం పాలన, తెలంగాణకు జరిగిన అన్యాయాలపైన, గద్దర్, విమలక్క గేయాలపై, ప్రొ.జయశంకర్లపై ప్రశ్నలు వచ్చాయని అన్నారు.



పేపర్ 4 ప్రశ్నాపత్రం కొంత అనుకూలంగా ఉందని అభ్యర్థులు తెలిపారు.

**చంద్రబాబుపై ప్రశ్నలు**

గ్రూప్ 2 పరీక్షలో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబుపై కొన్ని ప్రశ్నలు అడిగారు. నిజాం సాగర్, కడెం ప్రాజెక్టులు ఎవరి పాలనలో నిర్మించారు..?, చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు పాలనా వ్యవస్థపై విజన్ 2020 డాక్యుమెంట్ తయారుచేసిన అంతర్జాతీయ సంస్థ ఏదీ..? వంటి ప్రశ్నలు వచ్చాయి. అలాగే ఎన్టిఆర్, వైఎస్ఆర్, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాలపై.. పలు అంశాలపై ప్రశ్నలు వచ్చాయి. కెసిఆర్, సోనియా గాంధీ, చిదంబరం, ప్రణబ్ ముఖర్జీలపై ప్రశ్నలు అడిగారు. అలాగే తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి ఓ ప్రశ్న వచ్చింది.

**పురిటి నొప్పులతో పరీక్ష రాసిన నిండు గర్భిణీ**

నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్ష జరుగుతున్న కేంద్రంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఓ నిండు గర్భిణీ గ్రూప్- 2 పరీక్షలు రాశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి అనే గర్భిణీ నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రూప్- 2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. ఆదివారం (డిసెంబరు 15న) గ్రూప్ -2 మొదటి రోజు పరీక్షలు రాయగా, సోమవారం (డిసెంబరు 16) గ్రూప్ -2 ఉదయం పేపర్-3 పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు మెల్లగా పురిటి నొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ అధికారులు రేవతిని వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి సిద్ధమయ్యారు.
కానీ, ఆమె అందుకు అంగీకరించలేదు. పరీక్ష రాస్తానని గట్టిగా చెప్పారు. రేవతి డెలివరీ తేదీ సోమవారం (డిసెంబరు 16) కావడంతో పరీక్ష కేంద్రంలో సిబ్బందితో సహా అందరూ ఆందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం కూడా పరీక్ష రాస్తే గ్రూప్-2 మొత్తం నాలుగు పేపర్లు పూర్తవుతాయి. నాలుగో పేపర్ కూడా రాస్తానని ఆమె పట్టుబట్టారు. అధికారులు ఎంత చెప్పినా వినకపోవడంతో ఈ విషయాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆమె కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే గర్భిణీ కోసం పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. పరీక్ష బాగా రాయమని రేవతికి వైద్య సిబ్బంది ధైర్యం చెప్పి ప్రోత్సహించారు. పరీక్ష పూర్తయ్యే వరకు అందరూ టెన్షన్ పడినా, నాలుగో పేపర్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేసి రేవతి బయటికి రావడంతో ఆమెను నేరుగా 108 సిబ్బంది జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆమె బంధువులు, ప్రభుత్వ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**ఆసుపత్రి పాలైన నిరుద్యోగి**

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరులో గ్రూప్ 2 పరీక్షకు హాజరైన ఓ నిరుద్యోగి ఆకస్మాత్తుగా ఆసుపత్రిలో చేరాడు. స్థానిక అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలోకి వెళ్తే.. పుల్కస్ మండలం, లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన ఎల్ నగేశ్ గ్రూప్ 2 కు హాజరయ్యాడు. పరీక్ష రాస్తున్న క్రమంలో ఒక్కసారి మూర్ఛ (ఫిట్స్) వచ్చి నేలకొరిగాడు. ఈ విషయాన్ని గమనించి కంగారుపడిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరీక్ష కేంద్రంలో విధుల్లో ఉన్న ఎస్ఐ అసీఫ్ హుటాహుటిన తన భుజాలపై ఆ యువకుడిని పరీక్ష కేంద్రం నుంచి బయటకు తీసుకొచ్చి 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

# బిఆర్ఎస్ ఖేల్ ఖతం అని తెలుసు

## అందుకే కెసిఆర్ సభకు రావడం లేదు
## మంత్రి కోమటిరెడ్డి సెటైర్లు



హైదరాబాద్,డిసెంబర్ 16ప్రజావినికిడి:: ఐదుగురు ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క రోజూ సభకు వచ్చారని.. 38 మంది ఉన్న బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ ఎందుకు రావడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి కంటే ఎక్కువ విలువ ప్రతిపక్ష నాయకుడికి ఉంటుందన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఖతం అవుతుంది అని కేసీఆర్ ముందే తెలుసుకొని సభకు రావడం లేదన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం కేసీఆర్‌కు లేదని.. అందుకే అసెంబ్లీ వస్తలేరు అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. కొడుకు , అల్లుడు , బిడ్డలను తాము పట్టించుకోమన్నారు. డీలిమిటేషన్‌లో 34 అసెంబ్లీ సీట్లు, 7 ఎంపీ సీట్లు పెరుగుతాయన్నారు. జమిలి డ్రాఫ్ట్ రెడీ అయిందన్నారు. మా సీఎం , మంత్రులు పబ్లిక్‌కి అందుబాటులో ఉంటున్నాము ప్రతిపక్ష హోదా లేకున్నా ఖర్గే, అదిర్ రంజన్ చౌదరి పార్లమెంట్‌కి వెళ్లారన్నారు. బ్జడెట్ సమావేశాల వరకు కొత్త మంత్రివర్గం రెడీ అవుతుందని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్‌లో మంత్రి వర్గ విస్తరణలో ఎవరికి పదవులు అనేది ఎవరు చెప్పలేరన్నారు. ఈ విషయం పార్టీ అధిష్ఠానం, సీఎందే తుది నిర్ణయమన్నారు. పాలమూరు నుంచి శ్రీహరికి కచ్చితంగా మంత్రి పదవి.. ఇది మాత్రం చెప్పగలనన్నారు. నల్గొండలో 2018లో భూపాల్ రెడ్డిని వికలాంగుడు అనే సానుభూతితో గెలిపించారంటూ మంత్రి విమర్శించారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ ఓడారు.. నేనెంత అంటూ వ్యాఖ్యానించారు. కల్వకుర్తిలో ఎన్టీఆర్ మీద చిత్త రంజన్ ఇంట్లో నుంచి గెలిచారన్నారు. తన మీద గెలిచేందుకు బూర నర్సయ్య రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని.. అయినా తానే గెలిచానన్నారు. ప్రతిపక్ష ఎంపీగా ఎన్నో రోడ్ ప్రాజెక్టులు తీసుకొచ్చామన్నారు. గడ్కరీ నిన్న సీఎంకు చెబుతూ.. వెంకన్న నాకు చోటా బాయ్ అన్నారన్నారు.

# అప్పులపై ఆర్థిక మంత్రి తప్పుడు నివేదిక

## బీఆర్ఎస్‌కు భంగం కలిగిలా హక్కుల ఉల్లంఘన : మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 16ప్రజావినికిడి:: తెలంగాణ అప్పులపై రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఉద్దేశపూర్తంగా తప్పుడు సమాచారం ఇచ్చారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు సభా హక్కుల ఉల్లంఘటన నోటీసు ఇస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అప్పులపై ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవం అని 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్' పేరుతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన నివేదిక నిరూపించింది. 2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ.3,89,673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించింది. అప్పులపై రాష్ట్ర ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించారు. అందువల్ల తెలంగాణ శాసనసభ కార్య విధాన, కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం భారత రాష్ట్ర సమితి శాసనసభా పక్షం తరఫున ఆర్థిక మంత్రిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తున్నామని ఎక్స్ వేదికగా కేటీఆర్ వెల్లడించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# పోలవరం ఎపికి గేమ్ ఛేంజర్

**- నదుల అనుసంధానంతో నీటి సమస్యకు చెక్ - రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్ట్ సర్వనాశనం**

**- పోలవరంపై అధికారులతో సమీక్ష..సందర్శన - పోలవరం, అమరావతి రెండు కళ్లు**

**- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**



ఏలూరు,డిసెంబర్ 16ప్రజావినికిడి:
: ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత పోలవరం, అమరావతి రెండు కళ్లు అని.. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించిన సీఎం అనంతరం మీడియాతో మాట్లాడుతూ... రివర్స్ టెండరింగ్ పేరుతో అప్పటి కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చి బయటకు పంపేశారని.. అప్పటి కాంట్రాక్టర్‌ను మార్చి రాటిఫికేషన్‌కు పంపించారు దుర్మార్గులు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి అవినీతి, కుట్ర, అనుభవరాహిత్యం వలన అంతా నాశనం చేశారన్నారు. దీంతో ఐదేళ్ల పోలవరం వెనకబడిందన్నారు. పోలవరం పూర్తి చేసి, నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి లైఫ్ లైన్ అవుతుందన్నారు. గొల్లపల్లి, బనకచర్లకు మూడు దశల్లో అనుసంధానం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా పోలవరం నిర్మాణ పనులపై అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలవరంకు పనులకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు అధికారులు వెల్లడించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో అన్ని జిల్లాలకు నీటి సమస్య లేకుండా చేయొచ్చని ఆయన అన్నారు. పోలవరం ఎంతో ప్రాముఖ్యత ఉన్న ప్రాజెక్టు.. 2014-19 మధ్య రేయింబవళ్ళు పని చేశామని ఆయన అన్నారు. టీడీపీ హయాంలో 72శాతం పనులు చేశామని సీఎం చంద్రబాబు అన్నారు. 2019లో ప్రభుత్వం మారిన వెంటనే కాంట్రాక్టర్లను మార్చారని, రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టు ను నాశనం చేసారన్నారు. కుట్ర, కుతంత్రాలు, రాజకీయాలతో ప్రాజెక్టు సర్వ నాశనం చేసారని, 2020తర్వాత వచ్చిన వరదలతో గ్యాప్ 1 లో రెండు వందల మీటర్ల మేర అగాధాలు ఏర్పడ్డాయని, వైబ్రో కాంపాక్షన్ ద్వారా ఇసుకతో ఆగాధాలు పూడ్చి పనులు చేయాలన్నారు. ప్రాజెక్టు నిర్లక్ష్యం చేయడం వల్ల2,400 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందని, ఖీఓఅ, ఒఓఅ కెనాల్ పనులు పూర్తి చేయాల్సి ఉందని, పోలవరం 2026అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంతో ఉన్నామన్నారు సీఎం చంద్రబాబు. ఎప్పుడెప్పుడు ఏ పని చేయాలనే విషయంలో అధికారులు పూర్తి క్లారిటీతో ఉండాలి..ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021నాటికి ప్రాజెక్టు పూర్తి అయ్యేదని, పట్టిసీమ లేకుండా ఉంటే కృష్ణ డెల్టా ఎడారిగా మారేదన్నారు. ఒక వ్యక్తి అలసత్వానికి పోలవరం ఒక నిదర్శనమని, నాశనం అయినా ప్రాజెక్టు ను గాడిలో పెట్టడమే కాకుండా పూర్తి చేయడం లక్ష్యమన్నారు సీఎం చంద్రబాబు. తెలిసి చేసినా , తెలియక చేసినా తప్పు తప్పే అని చంద్రబాబు అన్నారు.ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కూడా రాష్ట్రానికికి నీటి సమస్య ఉండదని తెలిపారు. చైనాలో ఉండే త్రీ జాగాడ్జెస్ డ్యాం కంటే పోలవరం ఎత్తయిన ప్రాజెక్టు అని చెప్పుకొచ్చారు. 2014లో తెలంగాణాలోని ఏడు మండలాలు ఇస్తేనే ప్రమాణం చేస్తానంటే, కేంద్రం ఆ మండలాలను విలీనం చేశారని తెలిపారు. అప్పట్లో దయాఫ్రం వాల్‌ను460 కోట్లతో బావర్ సంస్థ నిర్మించిందని.. మొత్తం మీద 72 శాతం పనులు చేశామన్నారు. 30 సార్లు పోలవరం వచ్చానని.. అలాగే 80 సార్లు వర్చువల్‌గా రివ్యూ చేసినట్లు తెలిపారు. అటువంటి ప్రాజెక్టును వైసీపీ సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. 2020లో కాపర్ డ్యాం గ్యాప్‌ను కట్టకపోవడంతో వరద వలన దయాఫ్రం వాల్ దెబ్బతిందని.. ఇప్పుడు డీ వాల్ కట్టాలంటే రూ.2400 కోట్లు అదనంగా అవుతుందన్నారు. రూ.440 కోట్లు అప్పటి డి వాల్‌కు అయ్యిందని.. కేంద్రం పోలవరంకు ఇచ్చిన నిధులను మళ్ళించారన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి సివిల్ వర్క్స్ 71.3 శాతం తాము చేస్తే, వారు కేవలం 3.5 శాతం మాత్రమే చేశారని వెల్లడించారు. రూ.12,150 కోట్లను మొదటిదశ గా కేంద్రం మంజూరు చేసిందని.. రూ.2150 కోట్లు నిధులను విడుదల చేశారన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని.. పనులను వేగవంతం చేయనున్నామన్నారు. 'వచ్చే ఏడాది జనవరి 2 న దయాఫ్రం వాల్ పనులు ప్రారంభిస్తాం.. 2026 మార్చి నాటికి పూర్తవుతాయని అధుకారులు అంటున్నారు. 2025 డిసెంబర్ నాటికి దయాఫ్రం వాల్ నిర్మాణం జరగాలి అని అంటున్నా.. 2027 నాటికి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేస్తామంటున్నారు. ఇంకా ముందే పూర్తి చేయాలని అధికారులకు చెప్పా. 2026 నాటికి నీటిని నిల్వ చేసే పరిస్థితి రావాలని అంటున్నాను. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్‌ను 2026 నాటికి పూర్తి చేస్తాం. ప్రాజెక్టును 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నదుల అనుసంధానం జరగాల్సి ఉంది. ఇతర రాష్ట్రాలతో కొంత వివాదాలు ఉన్నాయి.. వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. 'మంచి చేసే వారితో పాటు చెడు చేసేవారిని గుర్తుంచుకోవాలి. విధ్వంసం చేశారు.. చూస్తుంటే చాలా బాధ అనిపిస్తుంది. 2019తరువాత కూడా టీడీపీ అధికారంలో ఉంటే 2021నాటికు ప్రాజెక్టు పూర్తయ్యేది. ఒక వ్యక్తి మూర్ఖత్వానికి , రాక్షసత్వానికి ప్రాజెక్టు బలయ్యింది. నాశనం చేసిన ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను దేవుడు నాకు అప్పగించింది. అయిదేళ్ల కాలంలో ప్రాజెక్టు పనులు చేయకపోవడం వలన రూ.15 వేల కోట్ల వరకు నష్టం వచ్చి ఉంటుంది. ప్రాజెక్టు పూర్తయితే, ఆ లాభం కూడా వచ్చి ఉండేది. అది కూడా నష్టపోయారు. హైదరాబాద్ ఆదాయం వలన సరాసరి ఆదాయంలో తెలంగాణ దేశంలో మొదట స్థానంలో ఉంది. పోలవరం, అమరావతి రెండు కళ్లను పొడిచేసి, నాశనం చేశారు. ప్రజలు వారికి శిక్ష విధించారు. 11 సీట్లు ఇచ్చారు.. కాని నష్టపోయిన దానిని రికవరీచేయలేం. రాష్ట్రంలో గత ఆరునెలలుగా బూతులు లేవు . అంతకుముందు ప్రతీ రోజు బూతులు మాట్లాడేవారు. ఇప్పుడు అక్కడక్కడ మాత్రమే వినిపిస్తున్నాయి. వాటిని కట్టడి చేయగలిగాం కానీ, నష్టాన్ని భర్తీ చేయలేకపోతున్నాం. పోలవరం ప్రాజెక్టుకు నేను ఇచ్చిన అన్ని డెడ్ లైన్లను పూర్తిచేశాం. ఒక్కొక్కసారి విధి డెడ్ లైన్‌ను మార్చుతుంది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్‌ను రెండు దశల్లో పూర్తి చేస్తాం. మొదటి దశలో 41.15మీటర్ల ఎత్తులో ముంపుకు గురయ్యే నిర్వాసితులకు, రెండవ దశలో 45.75మీటర్ల ఎత్తులో ముంపుకు గురయ్యే నిర్వాసితులకు పూర్తి చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరంలో పర్యటన ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు తిరిగి అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఆయనవెంట మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు ఉన్నారు.

# మేడారం ఆలయాలకు మహర్దశ

**అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయింపు**

**నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.92 కోట్లు మంజూరు**

**పునర్నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తి**

**2026లో జరిగే మహాజాతర నాటికి పనులు పూర్తి**




హైదరాబాద్‌డిసెంబర్ 16ప్రజావినికిడి:
మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. 2026లో జరిగే మహాజాతర నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులు పట్టుదలగా ఉన్నారు. ఈ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.92 కోట్లు మంజూరు చేసింది. దీంతో పనులు వేగంగా జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. 1971లో దేవాదాయశాఖ వనదేవతలిద్దరికీ ఆలయాలు నిర్మించింది. అవి చిన్నగా ఉండటం, ప్రస్తుతం భక్తుల రాక పెరగడంతో పూజా కార్యక్రమాలకు ఇబ్బందిగా మారింది. దీంతో నూతన నిర్మాణాలు చేపట్టాలని పూజారులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. దీనిపై దృష్టిసారించిన దేవాదాయశాఖ.. ఈ ఏడాది మహాజాతర ముగిసిన తర్వాత మార్చిలో ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో.. నవంబరులో రూ.1.92 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నెల 12న టెండరు ప్రక్రియ ముగిసింది. త్వరలోనే పనులు ప్రారంభించి మహాజాతర కంటే ముందే నిర్మాణం పూర్తి చేస్తామని.. మేడారం ఆలయ కార్యనిర్వహణాధికారి స్పష్టం చేశారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర.. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర. రెండేళ్లకోసారి జరిగే ఈ వనదేవతల జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. గతంలో కేవలం జాతర సమయంలోనే భక్తులు వచ్చేవారు. కానీ ఇప్పుడు నిత్యం వేల మంది అమ్మవార్ల దర్శనం కోసం వస్తున్నారు. మేడారంలోని దేవతల గద్దెల ప్రాంగణం విస్తరణకు మాస్టర్ ప్లాన్ రూపొందనుంది. నాలుగు దశాబ్దాల కిందట దాతలు నిర్మించిన గద్దెల ప్రాంగణమే ఇప్పటికీ అందుబాటులో ఉంది. జాతరకు ముందు అప్పుడప్పుడు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. కానీ శాశ్వతంగా అభివృద్ధి చేయడం లేదు. గద్దెల ప్రాంగణం వద్ద ఎలాంటి మార్పులు చేయకపోవడంతో.. జాతర సమయంలో భక్తుల నియంత్రణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్పటికే మేడారం వెళ్లే రహదారుల అభివృద్ధికి రూ.17.50 కోట్లు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలకు రూ.3.50 కోట్లు మంజూరు చేసి.. పనులు చేపట్టారు. తాజాగా.. వనదేవతల గద్దెల ప్రాంగణంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందినట్లు అధికారులు చెబుతున్నారు. సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొనేందుకు పస్రా, చింతల్, కొండాయి, తాడ్వాయి మీదుగా మేడారంలో ప్రవేశించి.. గద్దెల ప్రాంగణానికి చేరుకొనేందుకు వీలుగా రోడ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

## ప్రజా సమస్యల నుంచి పారిపోతున్న కాంగ్రెస్

**ఎంత తప్పించుకున్న కాంగ్రెస్ పాలనను ఎండగడతాం : జగదీశ్‌రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 16ప్రజావినికిడి:ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్ రెడ్డి విమర్శించారు. ఎంత తప్పించుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రజలపై పడిందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో బడాబాబులకు దోచిపెట్టే కుట్రకు తెరతీసిందని ఆరోపించారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. జైలులో ఉన్న లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారని అన్నారు. లగచర్ల ఘటనపై చర్చకు కోరితే ప్రభుత్వం పారిపోయిందని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కాదన్న విషయం గుర్తించాలని జగదీశ్ రెడ్డి సూచించారు. స్పీకర్ మా నోరు నొక్కుతున్నారని తిట్లు తిట్టేవారికే అవకాశం కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తిపై ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలన నుంచి పారిపోతోందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం భేటీ

**పలు కీలక అంశాలపై చర్చ**

**నాగబాబును మంత్రి వర్గంలో చోటుపై ఆరా**

**నాగబాబుకు కేటాయించే శాఖపై కసరత్తు**



అమరావతి,డిసెంబర్ 16ప్రజావినికిడి:
ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ అయ్యారు. పలు కీలక అంశాలపై ఈ చర్చలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆయనకు కేటాయించే శాఖలపై కూడా ఈ భేటీలో చర్చించినట్టు తెలుస్తోంది. చంద్రబాబుతో జరిగిన భేటీలో ప్రధానంగా పవన్ కళ్యాణ్ శాఖకు సంబంధించి అంశాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. త్వరలో జరిగే సహకారం సంఘాల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. రాజ్యసభ ఎన్నికలు పూర్తవడం, కొత్త సభ్యులు కొలువుదీరిన నేపథ్యంలో నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే నిర్ణ?యంపై ఈ భేటీలో చర్చించినట్టు తెలుస్తోంది. చంద్రబాబుతో జరిగిన భేటీలో నామినేటెడ్ పదవుల తుది జాబితాను ఖరారు చేయడంతో పాటు ఇతర అంశాలపైనా చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో రాబోయే సహకార ఎన్నికల్లోనూ ఇదే తరహా సమన్వయం కొనసాగించాలని ఇరువురు నేతలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# హైదరాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**గతంల ఎన్నడూ లేనంతగా 7.1 డిగ్రీలుగా నమోదు**



హైదరాబాద్, డిసెంబర్ 16ప్రజావినికిడి:
హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. గత ఆరేండ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి పడిపోయాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడుపల్లి 9.9, కుత్బుల్లాపూర్, మచ్చబొల్లారం 10.2, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్‌నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శ్‌నగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీలు రికార్డయ్యాయి. నిర్మల్ జిల్లా తాంద్రలో 6.3, ఆదిలాబాద్ జిల్లా పోచర 6.4, జైనాథ్ 6.5, అర్లి (టీ) 6.6, చాప్రాల్ 6.6, సంగారెడ్డి జిల్లా సత్వార్ 6.6, వికారాబాద్‌లోని బంట్వారం 6.7, సంగారెడ్డిలోని న్యాల్కల్‌లో 6.7, ఎలిమినేడు, రాచలూరు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్ యూ (ఆసిఫాబాద్) 6.7, చందనపల్లి (రంగారెడ్డి) 6.7, కోహీర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, వికారాబాద్ జిల్లాలోని నగరం (టీ), మన్నెగూడలో 6.8, నల్లవెల్లి (సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్ (సంగారెడ్డి) 6.9, మెనూర్ (కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు.




# 'కన్నప్ప' నుంచి మోహన్ లాల్ ఫస్ట్ లుక్

గత వారం రోజులుగా మంచు ఫ్యామిలీ కుటుంబ గొడవల కారణంగా వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. అయితే, తాజాగా మంచు కుటుంబం నుంచి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఇందులో నటిస్తున్న మోహన్ లాల్ పాత్ర తాలూకు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇక మైథలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న చిత్రాన్ని దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్ వంటి భారీ తారాగణం నటిస్తుండడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు ఇతర కీలక తారాగణం ఫస్ట్ లుక్‌లను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పుడు మలయాళం స్టార్ నటుడు మోహన్ లాల్ ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం రిలీజ్ చేసింది. ఈ మూవీలో ఆయన 'కిరాట' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్టు మేకర్స్ తెలిపారు. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో చూడటానికి ఆయన చాలా గంభీరంగా కనిపిస్తున్నారు.

# అక్కినేని హీరో 'లెనిన్'..?

అఖిల్ అక్కినేని గత ఏడాది 'ఏజెంట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలవడంతో తదుపరి సినిమా కోసం చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. 2024లో ఒక్క సినిమాను విడుదల చేయలేక పోయిన అఖిల్ వచ్చే ఏడాదిలో రెండు సినిమాలతో వచ్చే అవకాశాలు ఉన్నాయి. గత కొన్నాళ్ళుగా యూవీ క్రియేషన్స్‌లో ఒక సినిమాను అఖిల్ చేస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఆ సినిమా అప్‌డేట్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమాతో పాటు ఇటీవల వినరో భాగ్యము విష్ణు కథ దర్శకుడు మురళి కిషోర్ దర్శకత్వంలో ఒక సినిమాను చేసేందుకు కమిట్ అయ్యాడు. మురళి కిషోర్ దర్శకత్వంలో అఖిల్ హీరోగా చేయబోతున్న సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో నాగార్జున సొంతంగా నిర్మించబోతున్నారు. అఖిల్ హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. ఆ పట్టుదలతోనే సినిమాల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఒక కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ హిట్ కొట్టిన తర్వాతే అఖిల్ మీ ముందుకు వస్తాడు అంటూ ప్రకటించాడు. దాంతో అఖిల్ ఈసారి గట్టిగానే ప్రయత్నాలు చేయబోతున్నాడు అనిపిస్తోంది. అఖిల్ అక్కినేని హీరోగా ప్రస్తుతం వస్తున్న సినిమాల కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు అఖిల్ రెండు సినిమాల్లో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కానీ అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. మురళి కిషోర్ దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమా కోసం అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ వారు లెనిన్ అనే టైటిల్‌ను రిజిస్టర్ చేయించారు అనే వార్తలు వస్తున్నాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లెనిన్ టైటిల్‌ను బ్లాక్ చేసిందని సినీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. అందుకే అఖిల్‌ను వచ్చే ఏడాదిలో లెనిన్‌గా చూడబోతున్నామనే వార్తలు వస్తున్నాయి. అతి త్వరలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. లెనిన్ అనే పవర్ ఫుల్ టైటిల్‌తో అఖిల్‌తో మురళి కిషోర్ ఎలాంటి సినిమాను చేయబోతున్నాడా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చిన్న సినిమాను తీసి విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న దర్శకుడు మురళి కిషోర్ ఈ సినిమాతో స్టార్ దర్శకుడిగా మారడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో ఈ కాంబో మూవీ కోసం ఆసక్తిగా ఉన్నామంటూ అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు కామెంట్స్ చేస్తున్నారు. ముందు ముందు అఖిల్ కెరీర్‌లో ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# భాగ్యశ్రీ.. సింపుల్ గా

మరాఠీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. మాస్ మహారాజా రవితేజ మూవీతో టాలీవుడ్ సినీ ఇండస్ట్రీకి పరిచయమైన విషయం తెలిసిందే. ఫ్రెండ్స్ ఎంకరేజ్మెంట్ తో మోడలింగ్ లో అడుగుపెట్టి కెరీర్ స్టార్ట్ చేసిన అమ్మడు.. ఆ తర్వాత అనేక బ్రాండ్స్ ను ప్రమోట్ చేశారు. పలు బిజినెస్ యాడ్స్ లో కనిపించి స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. గత ఏడాది బాలీవుడ్ మూవీ యారియన్ -2తో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమాలో తన అందం, అభినయంతో మెప్పించారు. చందూ ఛాంపియన్ అనే మరో హిందీ సినిమాలో నటించిన భాగ్యశ్రీ.. మిస్టర్ బచ్చన్ తో తెలుగులోకి వచ్చారు. ఆ సినిమాలో జిక్కీ రోల్ పోషించి తన యాక్టింగ్ తో మంచి ప్రశంసలు అందుకున్నారు. ఆమె హావభావాలతోపాటు డ్యాన్స్ కు టాలీవుడ్ మూవీ లవర్స్ ఫిదా అయ్యారు. మూవీ అనుకున్న స్థాయిలో ఆకట్టుకోకపోయినా.. భాగ్యశ్రీ మాత్రం స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఆమెకు ఆఫర్లు వచ్చినట్లు కనిపించకపోయినా.. రీసెంట్ గా రెండు క్రేజీ ఛాన్సులు అందుకున్నారు. ప్రస్తుతం మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ కాంత మూవీలో హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు. పీరియాడికల్ థ్రిల్లర్ జోనర్ లో రూపొందుతున్న ఆ సినిమాలో రానా విలన్ గా నటిస్తున్నారు. అదే సమయంలో యంగ్ హీరో రామ్ పోతినేని సినిమాలో హీరోయిన్ గా కనిపించనున్నారు. రీసెంట్ గా ఆ మూవీ షూటింగ్ స్టార్ట్ అయింది. అయితే సోషల్ మీడియాలో మిగతా హీరోయిన్లలాగా అంతలా యాక్టివ్ గా ఉండరు. అప్పుడప్పుడు మాత్రమే క్రేజీ పిక్స్ ను పోస్ట్ చేస్తుంటారు. కానీ ఓ రేంజ్ లో అలరిస్తుంటారు. తాజాగా కొత్త ఫొటోస్ ను షేర్ చేశారు. వైట్ టాప్, డెనిమ్ జీన్స్ లో దిగిన ట్రెండీ పిక్స్ ను పంచుకున్నారు. ప్రస్తుతం అవి సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. భాగ్యశ్రీ పిక్స్ అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సో గ్లామరస్ మేడమ్ అని చెబుతున్నారు. అట్రాక్ట్ అవుతున్నామని అంటున్నారు. లైకులు కొడుతూ షేర్ చేస్తున్నారు. సింపుల్ గా ఉండే సెగలు రేపుతున్నారని రచ్చ రచ్చ చేస్తున్నారు. నెక్ట్ మూవీస్ తో మంచి హిట్స్ కొట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు చెబుతున్నారు. మరి అమ్మడు తన చేతిలో ఉన్న కొత్త చిత్రాలతో సినీ ప్రియులను ఎలా ఆకట్టుకుంటారో వేచి చూడాలి.



# అగ్రనటుడు ప్రభాస్‌కు షూటింగ్‌లో గాయం



అగ్ర కథానాయకుడు ప్రభాస్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా.. ఆయన గాయపడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని ప్రభాస్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమాను వచ్చే ఏడాది జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. జనవరి 3న జపాన్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా జపాన్‌లో ప్రమోషన్స్‌లో పాల్గొనాల్సి ఉంది ప్రభాస్. అయితే తాను ఈ వేడుకకు రాలేకపోతున్నానని ప్రభాస్ వెల్లడించారు. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు, అభిమానాలకు ధన్యవాదాలు. జపాన్‌లోని అభిమానులని కలవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. కానీ మూవీ షూటింగ్‌లో నా కాలుకు గాయమైంది. దీంతో ఈ జపాన్‌కు రాలేకపోతున్న.. ఈ విషయంలో నన్ను క్షమించండి అంటూ ప్రభాస్ రాసుకోచ్చాడు.

# సల్మాన్ అభిమానులను గుడ్‌న్యూస్

## 27న సికిందర్ టీజర్ రిలీజ్

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుండగా.. విడుదల తేదీని ప్రకటించాల్సి ఉంది. కాగా అప్‌డేట్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త బయటకు వచ్చింది. సికిందర్ టీజర్ టైం రానే వచ్చింది. సల్మాన్‌ఖాన్ బర్త్ డే సందర్భంగా డిసెంబర్ 27న సికిందర్ టీజర్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇంకేంటి మరి సల్లూభాయ్ అభిమానులు డబుల్ సెలబ్రేషన్స్‌కు రెడీగా ఉండండి. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. పాపులర్ యాక్టర్ సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో మురుగదాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు ఎమోషన్స్‌ను హైలెట్ చేస్తూనే.. మరోవైపు అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించే హై ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతున్నాయట.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613